# మానవత్వం చాటుకున్న నందిగామ ఏసీపి తిలక్

**నందిగామ నవంబర్ 13 ప్రభాతవార్త:** వత్సవాయి మండలం గోపినేనిపాలెం గ్రామానికి చెందిన వృద్దురాలు లక్ష్మీనరసమ్మ తమ కుటుంబ సభ్యులు ఎవరు తనను సరిగ్గా చూడటం లేదని తన కుటుంబ సభ్యుల వల్ల తనకున్న ఇబ్బందులను ఏసిపి కి తెలియజేయడానికి బుధవారం ఉదయం ఏసిపి కార్యాలయానికి వచ్చిన వృద్దురాలు నడవలేని పరిస్థితుల్లో ఉందని తెలుసుకుని వెంటనే ఏసీబీ తిలక్ వృద్దురాలు ఉన్న ఆటోవద్దకే వచ్చి ఆమె సమస్యను అడిగి తెలుసుకోవడం జరిగినది. ఆ వృద్దిరాలి సమస్యను పరిష్కరిస్తామని ఏసిపి హామీ ఇవ్వడంతో వెంటనే వృద్దురాలు లక్ష్మీ నరసమ్మ సమస్యను పరిష్కరించాలని వత్సవాయి పోలీసులకు ఏసీపీ తిలక్ఆదేశాలు జారీ చేశారు. వృద్దురాలు ప్రయాణ ఖర్చులు కూడా ఆటో డ్రైవర్కు ఏసిపి అందజేశారు. ఎసిపి తిలక్ తన సమస్యను విని వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో వృద్దురాలు సంతోషంతో ఇంటికి వెనుతిరిగారు ఏసిపి తిలక్కు ఆమె ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.



# చంద్రబాబు,లోకేష్లను కలసిన చిల్లపల్లి శ్రీనివాసరావు

**మంగళగిరి,నవంబర్ 13,ప్రభాతవార్త :** ఏపి మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్ ఫ్రా స్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గా జనసేన పార్టీ మంగళగిరి నియోజక వర్గ ఇన్చార్జీ చిల్లపల్లి శ్రీనివాసరావును నియమించారు. ఈ నేపధ్యంలో రా ష్ట్రముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును పదవి కేటాయింపులో సహకరించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఐటి విద్యా శాఖల మంత్రి,మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేష్ను చిల్లపల్లి శ్రీనివాసరావు మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువాతోసత్కరించి, పూలమొక్క అందజేశారు. తనకు పదవి కేటాయింపు విషయంలో సహకరించినందుకు నారా లోకేష్కు కృతజ్ఞతలు తెలిపారు.





# ఎంపిని మర్యాదపూర్వకంగా కలిసిన జనసేన నేతలు

**కారంపూడి, నవంబరు 13 ప్రభాతవార్త:** నరసరావుపేట పార్లమెంటు సభ్యులు లావు శ్రీకృష్ణదేవ రాయలను జనసేన పార్టీ నేతలు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గానికి నిధులు కేటాయించి అభివృద్ధికి కృషి చేయాలన్నారు. పెండింగ్లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. జనసేన పార్టీ ప్రజల పక్షాన ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనరు బూసా రామాంజనేయులు, మండల పార్టీ అధ్యక్షుడు కేసానుపల్లి కృష్ణబాబు, మల్లయ్య, లాల్కృష్ణ, నరసింహారావు తదితరులు ఉన్నారు.



# రెండేళ్ళలో ట్రైబల్ యూనివర్సిటీ పూర్తిచేస్తాం

## -శాసనసభలో రాష్ట్ర విద్య,ఐటి శాఖల మంత్రి లోకేష్

**మంగళగిరి,నవంబర్ 13,ప్రభాతవార్త :** గత ప్రభుత్వ హయాంలో ట్రైబల్ వర్సిటీ స్థలం మార్చి ఐదేళ్ళు పనులు ముందుకు సాగకుండా జాప్యం చేశారు. రాజకీయంగా మాకు మంచిపేరు వస్తుందని స్థలాన్ని మార్చారు. 2019లోనిర్ణయించిన స్థలంలోనే వచ్చే రెండేళ్ళలో సెంట్రల్ ట్రైబర్ వరి ్సటీ పూర్తిచేస్తామని రాష్ట్ర విద్య,ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ స్పష్టంచేశారు. విభజన చట్టం ప్రకారం పెండింగ్లో ఉన్న విద్యాసంస్థలపై శాసనసభ్యులు బుచ్చయ్యచౌదరి,బొండా ఉమా అడిగిన ప్రశ్నలకు అసెంబ్లీలో మంత్రి లోకేష్ సమాధానమిస్తూ..2014-19మధ్య చంద్రబాబు నాయుడు అభివృద్ధి వికేంద్రీకరణకు ప్రాధాన్యత నిచ్చారు. ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన సెక్టార్ వైజ్ ఫోకస్ పెట్టి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. అనంతపురం జిల్లాకు కియా తెచ్చారు. చిత్తూరులో ఎలక్ట్రానిక్స్, నెల్లూరు విండ్ టర్బ్యుయిన్, కర్నూలు రెన్యూవబుల్ ఎనర్జీ వివిధ పరిశ్రమలను ప్రోత్సహించారు. అభివృద్ధి వికేంద్రీకరణ అంటే ఇది, 500కోట్లతో ప్యాలెస్ కట్టుకోవడంకాదు. ఐఐటి తిరుపతికి ఆగస్టు 9,2016లోనే భూములు కేటాయించి పనులు ప్రారంభించారు. ఎన్ఐటి తాడేపల్లి గూడెంకు ఏప్రిల్ 16,2016లోనే 172ఎకరాలు, విశాఖలో ఐఐఎంకు ఏప్రిల్ 16,2016లో 240ఎకరాలు భూములు, సెంట్రల్ వర్సిటీ అనంతపురానికి ఏప్రిల్ 16, 2016లో 491ఎకరాలు, ఐషర్కు 255ఎకరాలు, ట్రిపుల్ ఐటీలకు కూడా భూములు అప్పట్లోనే కేటాయించారు. యుద్దప్రాతిపదికన భూములు కేటాయించడమే గాక, కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు, పనుల పురోగతిని ఆనాడు ప్రతినెలా ముఖ్యమంత్రి సమీక్షించారు. అభివృద్ధి వికేంద్రీకరణలో భాగంగా విభజన చట్టంలో ఉన్న విద్యా సంస్థలను కూడా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. పనులను పూర్తిచేసేందుకు చిత్తశుద్ధితో కృషిచేశారు. ఆయా విద్యాసంస్థలకు, పెండింగ్లో ఉన్న రోడ్లు, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాల సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు కృషిచేస్తామని మంత్రి లోకేష్ పేర్కొన్నారు.

# ఎన్సిసి సర్టిఫికేట్ల ప్రధానం

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,నవంబర్ 13,ప్రభాతవార్త :** వర్సిటీలో ఎన్సిసి కేడెట్లకు ఎన్సిసి సర్టిఫికేట్లు ప్రధానం చేశారు. బుధవారం ఉపకులపతి ఆచార్య కంచర్ల గంగాధరరావు చేతుల మీదుగా ఎన్సిసి కేడెట్లకు "సి" సర్టిఫికేట్లు ప్రధానం చేశారు. ఏ గ్రేడ్లో నలుగురు, బి గ్రేడ్లో 10మంది, సి గ్రేడ్లో ఇద్దరు కేడెట్లకు ఈ సర్టిఫికేట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆచార్య



గంగాధరరావు మాట్లాడుతూ ఎన్సిసి తో క్రమశిక్షణ ఐకమత్యం అంకితభావం లక్ష్యసాధన సాధ్యమవుతాయన్నారు. సర్టిఫికేట్లు పొందిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంలో రెక్టార్ ఆచార్య కె.రత్నషీలా మణి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, ఓఎస్డి ఆచార్య ఆర్విఎస్ ఎస్సి ఎన్ రవికుమార్, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సిద్దయ్య, అసిస్టెంట్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.గోపికృష్ణ, డాక్టర్ డి.చంద్రమౌళి, ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ అధికారి డాక్టర్ తౌసిఫ్ విద్యార్థులను అభినందించారు.

# ఉత్తమ ఉపాధ్యాయులకు డిఈవో ప్రశంసలు

**గుంటూరు విద్య,నవంబర్ 13,ప్రభాతవార్త :** మౌలానా అబుల్ కలాం జయంతి, జాతీయ విద్యాదినోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయి ఉత్తమ ఉర్దూ ఉపాధ్యాయ అవార్డు పొందిన గుంటూరు జిల్లాకు చెందిన 3ఉపాధ్యాయులు..అహ్మదునీ స్సా, స్కూల్ అసిస్టెంట్, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నులకపేట, తాడేపల్లి మండలం, ఆర్.నాగమణి, సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయిరాలు నగరపాలక సంస్థ ఉర్దూ ప్రాథమిక పాఠశాల నెం.73 అహ్మద్ నగర్ గుంటూరు,. షేక్ రిజ్వానా బేగం సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయిని నగరపాలక సంస్థ ఉర్దూ ప్రాథమిక పాఠశాల నెం.76 సంగడిగుంట లను జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో డిఈవో సి.వి.రేణుక, ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి ఎండి ఖాశీం వారిని అభినందించారు. ఈ సందర్భంగా డీఈవో రేణుక మాట్లాడుతూ అవార్డు పొందిన ఉపాధ్యాయులు మరింత బాధ్యతతో పనిచేయాలని ఉర్దూ భాషకు మంచి భవిష్యత్తు ఉందని ఉర్దూ నేర్చుకుంటే అనేక రంగాల్లో రాణించవచ్చని, అవార్డు పొందిన ఉపాధ్యాయులు తల్లిదండ్రుల్లో చైతన్యం కలిగించి ఉర్దూ భాషాభివృద్ధికి, పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి, ఎండి ఖాశీం మాట్లాడుతూ ఉర్దూ ఉపాధ్యాయులు సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవంలో అవార్డులు పొందుతూ ప్రత్యేకంగా జాతీయ విద్యా దినోత్సవం రోజున రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఆధ్వర్యంలో ప్రశంసా పత్రం, నగదు పురస్కారం పొందడం ఎంతో అబినందనీయమని, ఇది ఉర్దూ ఉపాధ్యాయులకు దక్కే ప్రత్యేక గౌరవమన్నారు. కార్యక్రమంలో మైనార్టీ టిచర్స్ నాయకులు సయ్యద్ ఇషాక్, జిలాని తదితరులు పాల్గొన్నారు.



# అమరావతి వార్త



# ప్రభుత్వ విప్ సౌమ్యకు శుభాకాంక్షలు తెలిపిన తెలుగు తమ్ముళ్లు

**నందిగామ నవంబర్ 13 ప్రభాతవార్త:** ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వ విప్గా నియమితులైన నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య నియామకం పట్ల నందిగామ మండల ఎన్డీఏ కూటమి నాయకలు ఆనందాన్ని వ్యక్తపరచు హర్షం వెల్లబుచ్చారు. తంగిరాల సౌమ్యకి జిల్లా దిశ కమిటీ సభ్యురాలు మన్నేకళావతి మండల టిడిపి నాయకులు వేల్పుల భిక్షాలు పల్లెపోగు ప్రభుదాసు , షేక్ షాబ్జాన్ ఇంటూరి సీతయ్య ఉప్పుకుండూరు గురు ప్రసాద్ చెరుకూరు హైమారావు గోనెపల్లి చిన్న నాగేశ్వరరావు, వడ్డెల్లి సాంబశివరావు, అంకురావ్ చెరుకూరు సాంబశివరావు, తోట నాగమల్లేశ్వరరావు, చుండూరు శ్రీనివాసరావు వీరంకి వీరస్వామి నేలపల్లి సిద్దార్థ జనసేన బిజెపి నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. పలు గ్రామాల్లో టిడిపి నాయకులు మిఠాయిలు పంచి ఆనందాన్ని వ్యక్తం చేశారు. నందిగామ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు పట్టణ టిడిపి అధ్యక్షుడు యే చూరు రాము రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్గా నియామకం పట్ల మండల టిడిపి నాయకులు ఆనందాన్ని వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

# క్రీడల్లో రాణించాలి

## - నేడు జోన్-2 క్రీడా పోటీలు ప్రారంభం

**ఎ కొండూరు, నవంబరు 13, ప్రభాతవార్త :** ఎన్టిఆర్ జిల్లా ఎ కొండూరు మండలం కృష్ణారావుపాలెం గ్రామంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల / కళాశాలలో ఈ నెల 14, 15, 16 తేదీల్లో నిర్వహిస్తున్న జోన్-2 క్రీడా పోటీలకు సంబంధించి క్రీడాకారులకు ఏర్పాటు చేసిన ఆట స్థలాలను భోజన వసతి సౌకర్యాలను రాష్ట్ర సాంఘీక సంక్షేమ ఎస్సీ గురుకులాల జాయింట్ సెక్రటరీ (అడ్మినిస్ట్రేటివ్) కె.రాజ్యలక్ష్మి బుధవారం ప్రిన్సిపాల్ కె.సిద్దయ్య, జిల్లా



సమన్వయ కర్త కె.ప్రేమావతితో కలిసి పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేస్తూ ప్రిన్సిపాల్ను కె.రాజ్యలక్ష్మి అభినందించారు. ఈస్ట్-వెస్ట్ ఉభయ గోదావరి, ఉమ్మడి కృష్ణా జిల్లాలకు సంబంధించిన 600 మంది వివిధ క్రీడాకారులు ఈ పోటీలో పాల్గొంటారని క్రీడాపోటీలకు సంబంధించిన పూర్తి వివరాలను ప్రిన్సిపాల్ సిద్దయ్య రాజ్యలక్ష్మికి వివరించారు. ఈ సందర్భంగా రాజ్యలక్ష్మి క్రీడాకారులతో కొద్దిసేపు ముచ్చటిస్తూ జిల్లా స్థాయి నుండి రాష్ట్రస్థాయిలో విజేతలుగా నిలిచి క్రీడల్లో రాణించి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని క్రీడాకారులను ఉత్సాహపర్చారు. ఈ పాఠశాల / కళాశాలలో ఏర్పాటు చేసిన క్రీడా మైదానాన్ని ఆహ్లాదకర వాతావరణాన్ని చూసి ఆమె ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. ఈ నెల 14న గురువారం ఈ క్రీడలను ఘనంగా ప్రారంభించటానికి ప్రిన్సిపాల్ సిద్దయ్య పకడ్బందీ ఏర్పాటు చేసినట్లు రాజ్యలక్ష్మి తెలిపారు.

# జాతీయ స్థాయి సిమ్మింగ్ పోటీలకు ఎంపికైన కాకతీయ సీబీఎస్ఈ విద్యార్థి

**నందిగామ నవంబర్ 13 ప్రభాతవార్త:** ఈ నెల 5 మరియు 6 తేదీలలో యు/14,17,19 68వ రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలను స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారు పలనాడు జిల్లాలోని నరసరావుపేటలో నిర్వహించడం జరుగుతుందని దీనిలో భాగంగా అండర్ 14 విభాగమున ఎస్ కీర్తన్ కాకతీయ విద్యార్థి మూడు బంగారు పథకాలు గెలుపొందటం జరిగింది. స్విమ్మింగ్ పోటీ విభాగాలు బ్యాక్ స్ట్రోక్ 100 మీ. విభాగంలో మొదటి స్థానం బ్యాక్స్ట్రోక్ 50 మీ. విభాగంలో మొదటి స్థానం ఫ్రీ స్టైల్ 50 మీ విభాగంలో మొదటి స్థానం ఈ నెల 23 నుండి 30 వరకు గుజరాత్లో రాజ్కోట్లోని జరిగే జాతీయ స్విమ్మింగ్ పోటీలకు ఎంపిక అవ్వడంజరిగినది. జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థికి కాకతీయ విద్యాసంస్థల చైర్మన్ కాపా రవీంద్రనాథ్ భారతి కాకతీయ డైరెక్టర్ కాపా కార్తికేయ సుష్మా ప్రిన్సిపల్ సత్యమూర్తి ఉపాధ్యాయుడు మరియు స్విమ్మింగ్ కోచ్ గోపీచంద్ విద్యార్థికి శుభాకాంక్షలు తెలియజేస్తూ జాతీయ స్థాయిలో కూడా నందిగామ పేరును తీసుకురావాలని ఆకాంక్షించారు.



# మైనరు బాలికను వేధిస్తున్న ఇరువురి అరెస్టు

## -రిమాండుకు తరలింపు

**విజయవాడ క్రైం,నవంబరు 13,ప్రభాతవార్త :** మైనరుబాలికను వేధించడమే కాక, అసభ్యపదజాలంతో ఇబ్బందులకు గురి చేస్తున్నారని మైనరు బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన అజిత్సింగ్నగర్ పోలీసులు న్యూ ఆర్ఆర్పేటకు చెందిన పబ్బిశెట్టి కళ్యాణ్, పవన్లను అరెస్ట్ చేసి వారిద్దరిని న్యాయమూర్తి ముందు హాజరుపర్చగా న్యాయమూర్తి వారిద్దరికి 14 రోజుల పాటు రిమాండును విధించారు.

# కె.వి.ఎం.ఎస్ బి ఓ ఆద్వర్యంలో హెచ్ఐవి, ఎయిడ్స్ పై అవగాహన

**కంచికచర్ల నవంబర్ 13 ప్రభాతవార్త:** కె.వి.ఎం.ఎస్.బి ఓ ఆద్వర్యంలో కంచికచర్ల పంచాయతీ ఆఫీస్ నందు మీకు తెలుసా కార్యక్రమం ద్వారా హెచ్ఐవి ఎయిడ్స్ పై అవగాహన . కంచికచర్ల ప్రతి ఒక్కరు ఎయిడ్స్ రహిత సమాజం కోసం కృషి చేయాలి ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండల నందు ఆంధ్రప్రదేశ్



ఎయిడ్స్ నియంత్రణ సమస్త ఆదేశాల మేరకు ఎయిడ్స్ నివారణ మరియు నియంత్రణ సంస్థ కె.వి ఎం. ఎస్ స్వచ్ఛంద ఆధ్వర్యంలో నిర్వహించిన మీకు తెలుసా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వి.రామారావు హాజరయ్యారు. ఈ కార్యక్రమం గురించి ప్రాజెక్టు మేనేజర్ మాట్లాడుతూ హెచ్ఐవి వ్యాధి ఎలా వస్తుంది? ఎలా వ్యాప్తి చెందదు హెచ్ఐవి రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి వివిధ అంశాలగురించి ఆయన తెలియజేశారు. అలాగే హెచ్ఐవి వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత చిన్నచూపు చూడకుండా సమాజంలో కలిసిమెలసి జీవించే విధంగా సహకరించాలని ఆయన కోరారు. మరియు సుఖ వ్యాధులు యొక్క వివరాలను తెలియజేశారు. 2017 ఎయిడ్స్ యాక్టివ్ గురించి కూడా వివరించారు. అలాగే టోల్ ఫ్రీ నెంబర్ 1097 గురించి కూడా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ షిబా మరియు ప్రాజెక్టు మేనేజర్ తదితర సిబ్బంది పాల్గొనడం జరిగింది.

# అనాధల సేవల్లో ఐడియాస్కు ప్రశంసలు

**తిరువూరు, నవంబరు 13, ప్రభాతవార్త :** ఎన్టిఆర్ జిల్లా తిరువూరులో బస్టాండ్ దగ్గర రాజపేటలో ఐడియాస్ సేవాసంస్థ ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ దయ దినోత్సవం సందర్భంగా కరోనా వ్యాధితో తల్లిదండ్రులను కోల్పోయి అనాధలైన 5,7 తరగతులు చదువుతున్న ఇద్దరు బాలికలకు తిరువూరు



పోలీస్స్టేషన్లో ఎస్సై కెవిజివి సత్యనారాయణ ఒక వేయి రూపాయలు, ఐడియాస్ వారు ఒక వేయి రూపాయలు వితరణ చేశారు. ఎస్సై సత్యనారాయణ మాట్లాడుతూ గత 28 సంవత్సరాలుగా ఐడియాస్ చేస్తున్న అనాథ సేవలను ప్రశంసించారు. గంపలగూడెం మండలంలో నిన్న 60మంది అనాథ బాలికలకు ఆర్థిక సహాయం చేసిన విషయం అందరికి తెలిసిందే. ఈ కార్యక్రమంలో బాలికల తాతయ్యలు ఎం సత్యనారాయణ తిరువూరు వెంకటేశ్వరరావు, కోనపర్వం గ్రామం ఐడియాస్ డైరెక్టర్ అవ్వారి శౌరి, కో-ఆర్డినేటర్ బంధువుల పండు ప్రసాద్, ఈ విద్య లోక కో-ఆర్డినేటర్ కొంగల రవిబాబు, కృష్ణారెడ్డి కానిస్టేబుల్ తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ విపత్తుల సంస్థ ఆధ్వర్యంలో అవగాహన

**అమరావతి, నవంబర్ 13 ప్రభాతవార్త :** జాతీయ విపత్తుల సంస్థ ఆధ్వర్యంలో కృష్ణానదిలో అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. విజయవాడకు చెందిన కమాండెంట్ వివిఎన్ ప్రసన్న, ఇన్స్పెక్టర్ మన్మోహన్యాదవ్, వారి బృందం సభ్యులు కార్యక్రమంలో పాల్గొని ప్రజలకు





అవగాహన కల్పించారు. సముద్రంలో జరిగే వివిధ ప్రమాదాల గురించి తెలియజేశారు. అనుకోకుండా ప్రమాదాలు జరిగితే ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలిపారు. బోట్ల సహాయంతో ఎలా సహాయక చర్యలను చేపడతామో విద్యార్థులకు అధికారులు, వారి సిబ్బంది మాక్డ్రిల్ ద్వారా తెలియజేశారు.

# ఊపిరి కోల్పోతున్న తెలుగు భాషకు ప్రాణం పోసిన సిపిబ్రౌన్

**గుంటూరు కల్చరల్,నవంబర్ 13,ప్రభాతవార్త :** తెలుగు భాషా, సాహిత్యం తాళపత్రాల్లో అగ్గిపురుగులకు ఆహుతవుతూ మిణు మిణుకు మంటున్న దశలో తెలుగుదీపానికి శాశ్వత వెలుగునిచ్చిన మహనీయుడు సిపి బ్రౌన్ అని అవగాహన సంస్థ సభ్యులు నివాళులర్పించారు. అనంతరం సంస్థ కార్యాలయంలో తెలుగు సూర్యుడు సిపి బ్రౌన్ జయంతి కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో సంగీత విద్వాంసుడు వివిఎస్ఎన్ మల్లేశ్వరరావు మాట్లాడుతూ ఆంధ్రభాషోద్ధారకుడిగా గౌరవించబడిన మహనీయ భావుడు, ఆంధ్ర సాహిత్యాన్ని ప్రజ్వలింపచేసని ఘనుడన్నారు. సీనియర్ గాయకుడు డిటి సాయిబాబు, బిళ్ళా అశోక్ లు మాట్లాడుతూ బ్రౌన్ ఎంతో మంది పండితులను పోషించాడని, వారికినెలనెలా జీతమిచ్చేవాడని పుస్తక ప్రచురణ ఖర్చుల కారణంగా చివరికి అప్పులపాలయ్యా డన్నారు. ఊపిరి కోల్పోతున్న తెలుగు భాషకు ప్రాణం పోయడానికి బ్రౌన్ దిగి వచ్చాడన్నారు. కార్యక్రమంలో గాయనీ గాయకులు రాజశేఖర్, రామకృష్ణారెడ్డి, విద్యావేత్త ఆర్.వి.సింగరయ్య, యార్లగడ్డ లక్ష్మీప్రసన్న, బొల్లేపల్లి సుబ్బారావు, తదితరులు బ్రౌన్ కి నివాళులర్పించారు.

# తిరువూరు నుండి పుణ్యక్షేత్రాలకు ఆర్టీసి బస్సులు : డిఎం సుబ్రహ్మణ్యం

**ఎ కొండూరు, నవంబరు 13, ప్రభాతవార్త :** కార్తీకమాసం సందర్భంగా ఎన్టిఆర్ జిల్లా తిరువూరు ఆర్టీసి డిపో నుండి ఆయా పుణ్యక్షేత్రాలకు భక్తుల కొరకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిఎం ఎ.సుబ్రహ్మణ్యం బుధవారం మీడియాకు తెలిపారు. అన్నవరం పుణ్యక్షేత్రానికి ప్రతి శుక్ర శని ఆదివారం సాయంత్రం 5 గంటలకు ఎక్స్ప్రెస్ బస్సు బయలుదేరుతుందని డిఎం తెలిపారు. అలాగే ప్రతి శనివారం ఆదివారం రాత్రి 12 గంటలకు పంచారామాలకు సూపర్ లగ్జరీ బస్సు ప్రతి నెల పౌర్ణమి సమయానికి అరుణాచలంకు సూపర్ లగ్జరీబస్సు ప్రతి నెల ప్రతి శుక్రవారం రాత్రి 10గంటలకు వాడపల్లికి రెండు సూపర్ లగ్జరీ బస్సులు బయలుదేరుతాయని డిఎం తెలిపారు. ఈ బస్సులు తిరువూరు బస్టాండ్ నుండి బయలుదేరుతాయని ఈ సదావకాశాన్ని ప్రజలు (భక్తులు) వినియోగించుకుని సంస్థ అభివృద్ధికి సహకరించాలని డిఎం ఎ సుబ్రహ్మణ్యం కోరారు. మరిన్ని సలహాలు సూచనలు వివరాల కొరకు 9885661835 నెంబర్కు సంప్రదించాలని డిపో మేనేజర్ ఎ.సుబ్రహ్మణ్యం విజ్ఞప్తి చేశారు.

# 18 నుండి 25 వరకు ఉచిత గుండె పరీక్షలు

**అమరావతి, నవంబరు 13, ప్రభాతవార్త :** గుంటూరు జిల్లా వేమూరు నియోజకవర్గం జంపని గ్రామంలోని ఎబిఎస్టిఎ దర్బార్ చైర్మన్ అతా ముహమ్మద్ నిజాముద్దీన్ నిజామిషాతాజ్ ఖాదరీ బాబా (నిజాంబాబా) చీమలపాడు అతావుల్లా బాబా వారి దివ్య ఆశీస్సులతో ఈ నెల 18 నుండి 25వరకు అతావుల్లా బాబా జన్మదిన వేడుకలను పురస్కరించుకుని సుమారు 10వేల మందికి కుల మత వర్గ విచక్షణ లేకుండా గుండె సంబంధిత వ్యాధిగ్రస్తులకు ఢిల్లీకి చెందిన డాక్టర్ డికె గుప్తా కార్డియాలజిస్ట్ సూచన మేరకు ఉచిత మెడికల్ మెగా క్యాంప్ నిర్వహిస్తున్నట్లు నిజాంబాబా బుధవారం మీడియాకు తెలిపారు. గుండె సంబంధిత వ్యాధికి సంబంధించి ప్రజలు యువత ప్రతి ఒక్కరు వయస్సుతో నిమిత్తం లేకుండా తగు ముందస్తు జాగ్రత్తలు తీసుకుని విలువైన ప్రాణాన్ని కాపాడుకోవాలని అతా నిజాంబాబా కోరారు. నాగపూర్ తాజుద్దీన్ బాబా విజయనగరం ఖాదర్ వలీ బాబా చీమలపాడు గురుదేవులు అతావుల్లా బాబా వారి పాదపద్మాల దయ వల్ల తనకు సేవా కార్యక్రమాలు చేసే భాగ్యం కలిగిందని ఈ దర్బార్లో ప్రతిరోజు కులమతాలకతీతంగా లంగర్ షరీఫ్ అన్నదానం నిర్వహిస్తున్నట్లు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నానని అలాగేప్రతి ఏడాది అతావుల్లా బాబా జన్మదినోత్సవ వేడుకల సందర్భంగా ఉచిత మెడికల్ క్యాంప్లు, ఉచిత మెడిసిన్ కిట్లు అందచేస్తున్నట్లు నిజాంబాబా తెలిపారు. తన గురుదేవులు అతావుల్లా బాబా చూపిన శాంతి ప్రేమ మానవత్వం దానగుణాలను పుణికి పుచ్చుకుని వారి పాదపద్మాల దయతో తనకు ఈ సేవ చేసే భాగ్యం కలగడం అల్లాకు అంతిమదైవ ప్రవక్త హజరత్ ముహమ్మద్ సల్లాల్లాహు అలైమివ సల్లం దాసుడునై తన జీవితాన్ని సేవామార్గం వైపు నడిపిస్త దైవకృపకు పాత్రుడవుతానని ఈ సందర్భంగా అతా నిజాంబాబా కృతజ్ఞతలు తెలిపారు.



# సదరన్ క్యాంపులో అధికారులతో డైరెక్టర్ ఆకుల దుర్గాప్రసాద్

**తిరువూరు, నవంబరు 13, ప్రభాతవార్త :** ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఆదేశానుసారం ప్రభుత్వ హాస్పిటల్లో సదరన్ క్యాంపు జరుగుతున్న సందర్భంగా డైరెక్టర్ ఆకుల దుర్గాప్రసాద్ సందర్శించి, నిజంగా అంగవైకల్యం ఉన్నవారికి మాత్రమే సర్టిఫికెట్ జారీచేయండి, అవినీతికి తావు లేకుండా సర్టిఫికెట్స్ నిజమైన లబ్దిదారులకు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ హాస్పిటల్ సూపరిటెన్డెంట్ గార్గేయ డాక్టర్ భానుతేజ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.



# ఆచార్య త్రిమూర్తిరావుకు ఘన సన్మానం

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,నవంబర్ 13,ప్రభాతవార్త :** వర్సిటీలో సోషియాలజీ అండ్ సోషల్ వర్క్ విభాగపు ఆచార్యులు ప్రొఫెసర్ ఎం.త్రిమూర్తిరావు కి 2023-24 విద్యాసంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం లభించిన సందర్భంగా సోషియాలజీ, సోషల్ వర్క్ విభాగంలో అభినందన సభ ఏర్పాటుచేశారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన విభాగాధిపతి ఆచార్య వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆచార్య త్రిమూర్తిరావు కి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం లభించడం హర్షనీయమన్నారు. సోషియాలజీ విభాగానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. అలాగే ఆచార్య త్రిమూర్తిరావును రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపిక చేసిన సీఎం చంద్రబాబు, ఉన్నత విద్యా శాఖ మంత్రి నారా లోకేష్కి వర్సిటీ ఇన్చార్జి వైస్ చాన్సలర్ ఆచార్య గంగాధరరావులకు కృతజ్ఞతలు



తెలిపారు. ఆచార్యలు సరస్వతిరాజు అయ్యర్, ఆచార్య ధనలక్ష్మీ లు మాట్లాడుతూ వృత్తిపరంగానే కాకుండా వ్యక్తిగతంగా కూడా ఎంతో ఉన్నత వ్యక్తిత్వం కలిగిన త్రిమూర్తి కి పురస్కారం రావడం నిజంగానే చాలామంచి పరిణామమన్నారు. పురస్కార గ్రహీత ఆచార్య త్రిమూర్తిరావు మాట్లాడుతూ తనను ఈ పురస్కారానికి ఎంపిక చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్నత విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ లకు మనస్పూర్తిగా కృతజ్ఞతలు తెలిపారు. పురస్కారానికి ఎంపిక కావడానికి కారణమైన తన తల్లిదండ్రులను, కుటుంబ సభ్యులను తలచుకొని వారికి కృతజ్ఞతలు తెలిపారు. సోషియాలజీ, సోషల్ వర్క్ డిపార్ట్మెంట్ అభివృద్ధికి ఎప్పుడూ కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో విభాగపు అతిధి అధ్యాపకులు డాక్టర్ పి.రాజకుమార్, స్కాలర్స్ డాక్టర్ రాజశేఖర్, రాజేష్, స్వరూప్ పాల్, స్టూడెంట్స్, నాన్ టీచింగ్ స్టాఫ్ అభినందనలు తెలియజేశారు.

# సూపర్‌సిక్స్ పథకాల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం

## - సీపీఐ పల్నాడు జిల్లా సెక్రటరీ మారుతీ వరప్రసాదరావు



**మాచర్ల, నవంబరు 13 ప్రభాతవార్త:** సూపర్‌సిక్స్ పథకాల అమలులో కూటమి ప్రభుత్వం విఫలమైందని సీపీఐ పల్నాడు జిల్లా సెక్రటరీ మారుతీ వరప్రసాదరావు అన్నారు. స్థానిక కొమెర వీరాస్వామి భవన్‌లో బుధవారం జరిగిన మాచర్ల ఏరియా కమిటీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వరప్రసాదరావు మాట్లాడుతూ సూపర్‌సిక్స్ వాగ్ధానాలతో గద్దెనెక్కిన సీఎం చంద్రబాబు వాటి అమలులో విఫలమయ్యాడన్నారు. పేదలకు బాసటగా నిలిచే తల్లికి వందనం, ఆడబిడ్డలకు నెలకు రూ.1500 ఇస్తామన్న హామీలు వెంటనే అమలు చేయాలన్నారు. దీపం-2 పథకంతో సంవత్సరానికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందించి, పేద ప్రజలకు మేలు చేస్తామన్న కూటమి ప్రభుత్వం మరోవైపు కరెంటు బిల్లులను పెంచుతూ పేదలపై భారాన్ని మోపడంలో అర్థం లేదన్నారు. జిల్లా సహాయ కార్యదర్శి షేక్ హుస్సేన్, ఏరియా కార్యదర్శి మేకపోతుల శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ టిడ్కో ఇళ్లకు మౌలిక వసతులు కల్పించి లబ్ధిదారులకు వెంటనే అందజేయాలన్నారు. కనీసం రబీ సీజన్‌కైనా రైతులకు ఇస్తామన్న రూ.20 వేల రైతు భరోసా డబ్బులను వారి ఖాతాల్లో జమ చేయాలన్నారు. అదేవిధంగా లక్ష లోపు వడ్డీలేని రుణాన్ని కల్పించి రూ.3 లక్షల్లోపు పావలా వడ్డీకే రైతులకు పెట్టుబడులుగా ప్రభుత్వం అందజేయాలని డిమాండ్ చేశారు. ఇసుకను ఫ్రీగా అందించి కార్మికుల సంక్షేమానికి పాటుపడతామని, ఉన్న రేటుకు ఇసుకను మూడు రెట్లు పెంచి కార్మికుల పొట్ట కొడుతున్నారన్నారు. నిత్యావసరాల ధరలు చూస్తే ఆకాశాన్నంటి పేదలకు పూట గడవటం కష్టంగా మారిందన్నారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీల అమలుకు కృషి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాచర్ల, కారంపూడి సెక్రటరీలో మిద్దెపోగు బాబురావు, షేక్ సైదా, ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## సిఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపిన జంగా



**పిడుగురాళ్ల, నవంబరు 13 ప్రభాతవార్త:** టీటీడీ పాలక మండలి సభ్యునిగా అవకాశం కల్పించడంతో ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, ఆయన తనయుడు పిడుగురాళ్ల జడ్పీటీసీ వెంకటకోటయ్యలు బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబును దుశ్శాలువలతో సన్మానించి జ్ఞాపికను అందించారు.

## డిప్యూటీ స్పీకర్‌ను కలిసిన ఎమ్మెల్యే ప్రవీణ్



**సత్తెనపల్లి, నవంబర్ 13 ప్రభాతవార్త :** డిప్యూటీ స్పీకర్ గా నియమితులైన రఘురామకృష్ణంరాజును బుధవారం శాసనసభ్యులు భాష్యం ప్రవీణ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రవీణ్ మాట్లాడుతూ డిప్యూటీ స్పీకర్‌గా రఘురామకృష్ణంరాజు ఎన్నిక కావడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. వారికి సిఎం చంద్రబాబునాయుడు సముచిత స్థానం కల్పించారని తెలియజేశారు. భవిష్యత్తులో రఘురామకృష్ణంరాజు ఉన్నత పదవులను అలంకరించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఆకాంక్షించారు.

## తెదేపా సభ్యత్వ నమోదు



**సత్తెనపల్లి, నవంబర్ 13 ప్రభాతవార్త :** టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మండలంలోని ఫణిదం గ్రామంలో బుధవారం యువ నాయకులు, గుంటూరు నగర మాజీ మేయర్ కన్నా నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజు పలువురిచే పార్టీ సభ్యత్వం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు రాష్ట్ర మంత్రి నారా లోకేష్ సూచనల మేరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. మండల, గ్రామ పార్టీ నాయకులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారని తెలిపారు. మాజీ మేయర్ నాగరాజుతో పాటు గ్రామ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## తెదేపాపై పార్టీ కార్యకర్తలు అసంతృప్తి

**పొన్నూరు, నవంబర్ 13,ప్రభాతవార్త:** పొన్నూరు నియోజకవర్గంలో ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్‌కు పార్టీ అధిష్ఠానం సముచిత స్థానం ఇవ్వకపోవడం దారుణమని పలువురు టిడిపి నాయకులు అసంతృప్తి వ్యక్తం చేశారు. స్థానిక టిడిపి కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. నియోజవర్గంలో ఏడుసార్లు పోటీ చేసి ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన నరేంద్రకుమార్ పట్ల పార్టీ అనుసరిస్తు వైఖరి కార్యకర్తల్లో అసంతృప్తిని రాజేసు ౼ందన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో టిడిపి జెండాను ఎగురవేసిన ఘనత ఎమ్మెల్యే నరేంద్రకుమార్‌కు దక్కుతుందన్నారు. అలాంటి నాయకుడికి సముచిత స్థానం ఇవ్వకపోవడం కార్యకర్తలను, నాయకులను అవమానించడమేనన్నారు. జగన్మో హనరెడ్డి పాలనలో నరేంద్రకుమార్‌ను తీవ్రంగా వేధింపులకు గురిచేయడంతోపాటు జైల్లో పెట్టినా ఎదురొడ్డి పోరాటం చేశారన్నారు. అలాంటి ధూళిపాళ్ళకు మంత్రి పదవి ఇవ్వకపోగా, కనీసం చీఫ్ విఫ్ పదవి అయినా దక్కుతుందని నాయకులు, కార్యకర్తలు ఆశపడ్డారు. అయితే ఇందులో కూడా నరేంద్రకుమార్‌కు మొండి చేయి చూపడం అత్యంత ధారుణమన్నారు. జగన్మోహన రెడ్డి హయాంలో సంగం డెయిరీని ఆక్రమించు కునేందుకు చర్యలు చేపట్టిన సమయంలో సంగం డెయిరీని కాపాడుకునేందుకు నరేంద్ర కుమార్ చేసిన ఉద్యమాన్ని పార్టీ మరువడం భావ్యం కాదన్నారు. ఇప్పటికైనా పార్టీ అధిష్టానం పునరాలోచన చేసి క్యాబినెట్ ర్యాంకుకు తక్కువ కాకుండా పదవిని కట్టబెట్టాలని నాయకులు, కార్య కర్తలు కోరుతున్నారు. సమావేశంలో నియోజకవర్గ ఎన్నికల పోల్ మేనేజ్మెంట్ కో-ఆర్డినేటర్ మాదల వెంకటేశ్వరరావు, పట్టణ,మండల పార్టీ అధ్యక్షులు పఠాన్ అహమ్మద్‌ఖాన్, బండ్లమూడి బాబూరావు, మునిసిపల్ మాజీ వైస్ ఛైర్మన్ ఆకుల సాంబశివరావు, జిల్లా రైతు విభాగం ప్రధాన కార్యదర్శి బొర్రు రామారావు, మాజీ కౌన్సిలర్లు, అలపర్తి చంద్రమోహన్, యరసాని శ్రీరామమూర్తి, షేక్ బాజిసాహెబ్, కత్తుల రవికిరణ్, చలంశెట్టి సీతారామయ్య, గణిపిశెట్టి రామకృష్ణ, సొపాటి వెంకట్రావు, ఆరమండ విజయ్‌కుమార్, మున్నంగి సుబ్బారెడ్డి తదితరులున్నారు.



## నేడు లక్ష బిల్వార్చన

**పొన్నూరు, నవంబర్ 13,ప్రభాతవార్త:** కార్తీక మాసాన్ని పురస్కరించుకొని శ్రీ సహస్రలింగేశ్వర స్వామివారి దేవాలయంలో స్వామివారికి గురువారం ఉదయం 11గంటలకు లక్ష బిల్వార్చన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జవి అమర్నాథ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పొన్నూరు, పరిసర ప్రాంతాల భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రలు కావాలని కోరారు. భక్తులకు తీర్థప్రసాద వినియోగం జరుగుతుందని తెలిపారు. భక్తులు కార్యక్రమంలో విరివిగా పాల్గొని దేవాలయం అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్తీమ మాసం అతి పవిత్రమైన మాసం అయినందున భక్తులు ఆలయాలకు వెళ్ళి స్వామివారిని దర్శించుకొని సుఖశాంతులతో గడపాలని కార్యనిర్వహణాధికారి కోరారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

**పొన్నూరు, నవంబర్ 13,ప్రభాతవార్త:** మండల పరిధిలోని మునిపల్లె, మామిళ్ళపల్లి అడ్డరోడ్డు సమీపంలో రెండు వాహనాలు ఢీకొన్న సంఘటనలో వ్యక్తి దుర్మరణం పాలైన సంఘటన. పొన్నూరు రూరల్ ఎస్సై గండు కిరణ్‌బాబు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పొన్నూరు నుంచి గుంటూరు వైపుకు వెళ్తున్న స్కూటరిస్ట్‌ను గుంటూరు వైపు నుంచి అతివేగంగా వస్తున్న టాటా ఏసి వాహనం ఢీకొట్టి అదుపు తప్పి కాలువలోకి దూసుకెళ్ళింది. ఈ ప్రమాదంలో స్కూటర్‌పై ప్రయాణిస్తున్న తెనాలికి చెందిన తొడిమల చిన వెంకటేశ్వర్లు(54) అక్కడిక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న రూరల్ ఎస్సై గండు కిరణ్‌బాబు సంఘటనా స్థలానికి వెళ్ళి వివరాలను సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పల్నాడు జిల్లా 104 ఎంప్లాయిస్ యూనియన్ నూతన కార్యవర్గం



**నరసరావుపేట, నవంబర్ 13 ప్రభాతవార్త :** పల్నాడు జిల్లా 104 ఎంప్లాయిస్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర అధ్యక్షులు ఎం.ఫణికుమార్ ఆధ్వర్యంలో బుధవారం ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా ఆంజనేయులు నాయక్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా కోటిరెడి, విజయ్‌కుమార్‌లు ఎన్నికయ్యారు. కోశాధికారిగా జిలానీ, ఉపాధ్యక్షులుగా సుభాని, ఝాన్సీ, సభ్యులుగా పవన్‌కుమార్‌రెడ్డి, సాంబశివరావు, ఏసుదానం, వీరాంజనేయులు ఎంపికైన వారిలో ఉన్నారు. వారు మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కరించాలని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించామన్నారు. చాలిచాలని జీతాలతో కుటుంబాలు గడవని పరిస్థితి నెలకొందన్నారు. అరబిందో యాజమాన్యం ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లించకుండా మూడు నాలుగు నెలల పాటు ఇబ్బందులకు గురి చేస్తుందని ఈ సందర్భంగా యూనియన్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.

## వెల్లలూరు విద్యార్థులకు బంగారు పతకాలు

**పొన్నూరు, నవంబర్ 13,ప్రభాతవార్త:** మండల పరిధిలోని వెల్లలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పవర్ లిఫ్టింగ్ పోటీలలో అత్యధిక బంగారు పతకాలు సాధించినట్లు ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు ఎం.కిషోర్‌కుమార్ తెలిపారు. అవిభక్త కృష్ణాజిల్లా జగ్గయ్యపేటలో ఈ నెల 8వ తేదీ నుండి 10వ తేదీ వరకు నిర్వహించిన అమరావతి పవర్ లిఫ్టింగ్, వెయిట్‌లిఫ్టింగ్, బాక్సింగ్ పోటీలలో బంగారు పతకాల పంట పండిందన్నారు. పి.మానస 45 కేటగిరి సబ్‌జూనియర్, సీనియర్ ఎక్విప్ అన్ ఎక్విడ్ విభాగంలో ఆరు బంగారు పతకాలు, కె.లాస్య 63కేటగిరి సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగంలో ఐదు బంగారు పతకాలు, రెండు వెండి పతకాలు సాధించారన్నారు. పి.శిరీష 69కేటగిరిలో జూనియర్, సీనియర్ విభాగాలలో నాలుగు బంగారు పతకాలు సాధించారన్నారు. దేశ రాజధాని ఢిల్లీలో జరిగే జాతీయ పోటీలకు సెలక్ట్ అయినట్లు చెప్పారు. వీరితోపాటు గుంటూరులో జరిగిన సౌత్ ఇండియా సింగిల్ స్టిక్ విభాగంలో బంగారు పతకం సాధించిన బి.దివ్యవసంత్‌లను పాఠశాల ఉపాధ్యాయులు, ఎస్ఎంసి కమిటి సభ్యులు అభినందించారు. ఈ కార్యక్రమంలో కమిటి ఛైర్మన్ టి.నాగరాజు, కె.రమేష్, ఫిజికల్ డైరెక్టర్ డి.సరళ, కావూరి బాబూరావు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## మహిళా కబడ్డీ పోటీలలో విజేతగా కృష్ణవేణి డిగ్రీ కళాశాల

**నరసరావుపేట టౌన్, నవంబర్ 13 ప్రభాతవార్త :** ఏఎన్‌యూ మహిళా కబడ్డీ పోటీలలో కృష్ణవేణి డిగ్రీ కళాశాల విజేతగా నిలిచింది. వివరాలను కళాశాల ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు బుధవారం విజేతల అభినందన కార్యక్రమంలో తెలియజేశారు. ఏఎన్‌యూ పరిధిలో జరిగిన మహిళా కబడ్డీ పోటీలకు మొత్తం 11 జట్లు హాజరు కావడం జరిగిదన్నారు. ఈ పోటీలలో మొదటి స్థానంలో కృష్ణవేణి డిగ్రీ కళాశాల, ద్వితీయస్థానంలో ఏఎన్‌యూ యూనివర్శిటీ వ్యాయామ విద్య కళాశాల, మూడవ స్థానంలో తెనాలికి చెందిన జెఎంజె కళాశాల, నాల్గవ స్థానంలో నరసరావుపేట విక్టరీ డిగ్రీ కళాశాల నిలిచాయి. ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మానసిక, శారీరక ఉత్సాహంతో పాటు జీవితంలో వచ్చే సమస్యలను ఎదుర్కొనేందుకు క్రీడలు దోహదపడతాయన్నారు. తమ కళాశాలలో విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సతీష్‌బాబు, పి.డి.ఆదిబాబు, డైరెక్టర్ కె.నాసరయ్య, పరిశీలకులు సూర్యనారాయణ, వెంకట్రావు, కె.అరుణ తదితరులు పాల్గొన్నారు.




## లోకేష్ చొరవతో ఏపి వైపు పెట్టుబడిదారుల పరుగులు



**మంగళగిరి,నవంబర్ 13,ప్రభాతవార్త :** ఐటి విద్యాశాఖల మంత్రి మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేష్ చొరవతో విదేశాల నుంచి ఆంధ్రప్రదేశ్ కు పెట్టుబడిదారులు పరుగులు తీసు ్తన్నారని జనసేన పార్టీ మంగళగిరి నియోజకవర్గ నాయకులు తిరుమలశెట్టి కొండలరావు అన్నారు. బుధవారం స్థానిక ఉండవల్లిలోని నివాసంలో నారా లోకేష్ ను తిరుమలశెట్టి కొండలరావు కలిశారు. విదేశీ పర్యటనలో ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులు తీసుకురావడం పట్ల హర్షం వ్యక్తంచేస్తూ నారా లోకేష్‌కు అభినందనలు తెలిపారు. లోకేష్ శాసనసభ్యుడిగా భారీ మెజార్టీతో గెలిచి మంత్రిగా బాధ్యతలు చేపట్టిన కొద్ది రోజుల్లోనే అనేక మార్పులు తీసుకువచ్చారన్నారు. ఇటీవల ఏపి సిఎం నారా చంద్రబాబు మెరుగైన పనితీరు కనబరిచిన ముగ్గురి పేర్ల జాబితాని విడుదల చేశారని అందులో నారా లోకేష్ పేరు ఉండడం సంతోషించదగ్గ విషయమని పేర్కొన్నారు. భవిష్యత్తులో మంగళగిరి రాష్ట్రంలోనే ఆదర్శ నగరంగా నారా లోకేష్ తీర్చిదిద్దుతారని అందులో ఏ సందేహం లేదని కొండలరావు స్పష్టం చేశారు.

## ఉపాధి పనులను క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించిన పిడి



**యడ్లపాడు, నవంబర్ 13, ప్రభాతవార్త :** మండల పరిధిలోని సొలస, చెంఘీస్కాన్‌పేట, కొత్తపాలెం, గ్రామాలలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా నిర్వహించుతున్న పనులను జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ మరియు డ్వామా పీడీ సిద్దలింగ మూర్తి ఉపాధి హామీ సిబ్బందితో కలసి క్షేత్రస్థాయి పరిశీలన బుధవారం నిర్వహించారు. సొలస గ్రామంలో నిర్వహించుతున్న క్యాటిల్ షెడ్ పనులను, సిఐబి బోర్డులను పరిశీలించారు. తదుపరి కొత్తపాలెం గ్రామంలో ఫామ్ ఫాండ్స్ పనులను, చెంఘీస్కాన్‌పేట గ్రామంలో సెరీకల్చరల్ ద్వారా సాగుఅవుతున్న పంటలను పరిశీలించారు. అనంతరం కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బందితో సమావేశం అయ్యి కూలీలకు సంబంధించిన వివరాలు, డిమాండ్, యావరేజ్ వందరోజుల పనులను, క్యాటిల్ షెడ్‌ల వివరాలు, ప్లాంటేషన్‌కు సంబందించిన వాటిపై ఏపీవో మరియు టెక్నికల్ అసిస్టెంట్, కంప్యూటర్ అపరేటర్ మరియు క్షేత్రస్థాయి సహాయకులతో సమావేశమై రివ్యూ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడివో హేమలత, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఇంజనీరింగ్ విద్యార్థులకు వికాస్ సమ్మిట్‌లో బహుమతులు

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,నవంబర్ 13,ప్రభాతవార్త :** వర్సిటీ లోని ఇంజనీరింగ్ విద్యార్థులు ఏపి విట్ యూనివర్సిటీ నిర్వహించిన వికాస్ 2024 సమ్మిట్‌లో బహుమతులు గెలుపొందారు. వర్సిటీకి చెందిన ఐదుగురు విద్యార్థులు ఇన్నోవేటివ్ సమ్మిట్‌లో వివిధ ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఇందులో 1.గ్రెయిన్ కలెక్టింగ్ మిషన్, 2. వైల్డ్ లైఫ్ రెస్క్యూ అండ్ మానిటరింగ్, 3.జ్యూవెలరీ డిజైన్ అండ్ మాన్యూఫాక్చరింగ్ యూజింగ్ రెసిస్ త్రిడి ప్రింటింగ్, 4,రివర్స్ వెండింగ్ మెషిన్ ఫర్ ప్లాస్టిక్ మేనేజ్‌మెంట్, 5,చైన్ డ్రాగింగ్ బోట్ విత్ డైనమిక్ ఏరేషన్ ఉన్నాయి. తద్వారా మొదటి,రెండవ బహుమతులతోపాటు ప్రోత్సాహక బహుమతి కూడా లభించింది. ఈ సందర్భంగా బుధవారం ఉపకులపతి ఆచార్య గంగాధరరావు, రెక్టార్ ఆచార్య కె.రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం లు విద్యార్థులను అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని బహుమతులు సాధించి వర్సిటీ కీర్తిప్రతిష్టలు ఇనుమడింప చేయాలని సూచించారు. ఈ సందర్భంలో ఓఎస్‌డి ఆచార్య ఆర్‌విఎస్ఎస్‌సిఎన్ రవికుమార్, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సిద్దయ్య, అసిస్టెంట్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.గోపికృష్ణ, డాక్టర్ డి.చంద్రమౌళి, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ తౌసిఫ్ విద్యార్థులను అభినందించారు.



## న్యాయం చేయాలంటూ రోడ్డు ఎక్కిన మృతుల కుటుంబాలు





**కర్లపాలెం,నవంబర్13,ప్రభాతవార్త:** కర్లపాలెం మండలం బుద్దాం గ్రామం వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కొల్పోయిన ఇరువురు అయ్యప్ప స్వాములు కుటుంబాలు బుధవారం తమకు న్యాయం జరగాలంటూ రోడ్డు ఎక్కారు. కర్లపాలెం ఐలాండ్ సెంటర్‌లో మృతుల కుటుంబాలకు సంఘీభావంగా బాపట్ల కర్లపాలెం పరిసర ప్రాంతాల్లో ఉన్న ఎస్టీలు వారికి మద్దతుగా ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంగళవారం రోడ్డు ప్రమాదంలో ఇరువు చనిపోతే రాయల్ మెరైన్ కంపెనీ తరుపున కనీసం ఎవ్వరు కూడా వచ్చి పలకరించలేదని ఇది ఎంతవరకు సమంజసమని వారు పోలీసులను నిలదీశారు. మనుషుల ప్రాణాలంటే కంపెనీ వారికి లెక్క లేదా అంటూ ఇరువురు మృతుల భార్య పిల్లలతో భారీ వర్షంలో సైతం సెంటర్లో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా సందర్భంగా సెంటర్‌కి ఇరువైపులా వాహనాలు భారీగా స్తంభించాయి. విషయం తెలుసుకున్న బాపట్ల డిఎస్పీ రామాంజనేయులు, సిఐ హరికృష్ణ, డిటి శ్రీదేవి సంఘటనా స్థలానికి చేరుకొని బాధిత కుటుంబీకులతో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు ప్రాణాలు కొల్పోయిన కూడా ఇంతవరకు కంపెనీ వారు స్పందించకపోవడం ఏమిటని నిలదీశారు. దీనిపై డిఎస్పీ రామాంజనేయులు స్పందిస్తూ బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. అనంతరం మృతుడు హరీష్ ఇంటి వద్ద రాయల్ మెరైన్ కంపెనీ తరుపున కొంత మంది విచ్చేసి మృతుల కుటుంబీకులతో చర్చలు జరిపి వారి కుటుంబాలకు పూర్తిస్థాయిలో న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ధీంతో వారు ధర్నా విరమించారు. మొత్తం మీద మృతుల కుటుంబీకులు చేసిన ఆందోళన కార్యక్రమంతో కాసేపు కర్లపాలెం సెంటర్‌లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బారీ స్థాయిలో పోలీసులు మోహరించారు. రూరల్ సిఐ హరికృష్ణ. ఎస్సై రవీంద్ర ఆధ్వర్యంలో పోలీసులు భారీగా చేరుకొని ఆందోళన కార్యక్రమం అనంతరం ట్రాఫిక్‌ను క్లియర్ చేశరాఉ.

## తుపాను హెచ్చరికలతో ఆందోళనలో రైతాంగం



**మాచర్ల, నవంబరు 13 ప్రభాతవార్త:** రాష్ట్రానికి మరో తుపాను ప్రమాదం పొంచి ఉందన్న వాతావరణ శాఖ ముందస్తు హెచ్చరికలతో రైతన్నల్లో ఆందోళనలు నెలకొన్నాయి. పల్నాడు ప్రాంతంలో రైతులు వేలాది ఎకరాల్లో వరి, మిర్చి, పత్తి, పొగాకు, కంది సాగు చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో వరి కోతకు రావడంతో నూర్పిడికి రైతులు సిద్ధంగా ఉన్నారు. మరికొంత మంది వరినాట్లు ఆలస్యంగా వేయడంతో వరి పొట్టదశలో ఉంది. చేతికి అందివచ్చే పంట అకాల వర్షాలకు పాడైపోతుందని ఆందోళనలో ఉన్నారు. అలాగే పత్తి పంట కూడా విరుపులకు సన్నద్దంగా ఉంది. ఇప్పటికే చాలా వరకు పత్తి పంట చేతికొచ్చే దశలో ఉంది. మిర్చి వేసిన రైతులు కూడా ఇప్పటికే బొబ్బర తెగుళ్లతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. లక్షలాది రూపాయలు వడ్డీలకు తెచ్చి పెట్టుబడి పెట్టిన రైతులకు ఈ దశలో తుపాను హెచ్చరికలతో రైతుల్లో భయాందోళనలు నెలకొన్నాయి. చేతికి వచ్చే పంట అకాల వర్షంతో నష్టపోవాల్సిన పరిస్థితులు దాపురించేలా ఉన్నాయి. ఇక దేవుడే మా కష్టాలు గట్టెక్కించాలని రైతులు వేడుకుంటున్నారు.

## జనన ధ్రువీకరణ పత్రంలో తప్పులుంటే సరిదిద్దుకోండి : మునిసిపల్ కమిషనర్ వేణుబాబు




**మాచర్ల, నవంబరు 13 ప్రభాతవార్త:** జనన ధ్రువీకరణ పత్రంలో తప్పులు చోటు చేసుకుంటే మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించి మార్పులు చేయించుకోవాలని మున్సిపల్ కమిషనర్ వేణుబాబు అన్నారు. మున్సిపల్ కార్యాలయంలోని జనన, మరణ నమోదు విభాగంలో సంప్రదించి అవసరమైన ఆధారాలతో ఇ-సేవ, వార్డు సచివాలయాల్లో అర్జీలు దాఖలు చేసుకోవాలన్నారు. సరైన ధ్రువపత్రాలు లేకపోతే అర్జీ తిరస్కరణకు గురవుతుందన్నారు. పట్టణ పరిధిలోని ప్రజలు జనన ధ్రువీకరణ పత్రాలకు సంబంధించి 2016 వరకు జన్మించిన వారి వివరాల కోసం ఇ-సేవ, వార్డు సచివాలయాల్లో సంప్రదిచాలన్నారు. 2017 నుంచి జన్మించిన వారి వివరాల కోసం మున్సిపల్ కార్యాలయంలోని జనన, మరణ నమోదు విభాగం ఇన్‌ఛార్జిని, సిబ్బందిని సంప్రదించాలని ఆయన తెలిపారు.

## మేజరు కాలువలో మృతదేహం



**గురజాల, నవంబరు 13 ప్రభాతవార్త:** మండలంలోని పాత అంబాపురం, గోగులపాడు రహదారిలో గల మేజర్ కాలువలో పట్టలో కప్పిన మృతదేహం లభ్యమైంది. స్థానికులు సమాచారాన్ని అందించడంతో పోలీసులు అక్కడకు చేరుకొని పరిశీలించారు. మృతదేహం వద్ద ఉన్న సెల్‌ఫోన్ ఆధారంగా మృతుడు తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లా దోనిపాలకు చెందిన షేక్ షరీఫ్‌గా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## రెండు గ్రామాల్లో పొలం పిలుస్తోంది

**నూజెండ్ల,నవంబర్13,ప్రభాతవార్త:** వ్యవసాయ, అనుబంధశాఖల ఆధ్వర్యంలో మండలంలోని జంగాలపల్లి, త్రిపురాపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా మండల వ్యవసాయాధికారిణి సుగుణాబేగం కంది, మిరప, వరి పంటలను పరిశీలించి అనంతరం రైతులతో సమావేశం ఏర్పాటు చేసి సస్యరక్షణచర్యలను వివరించారు. వరిలో ఆకుముడత ఉధృతంగా ఉన్నట్లు గుర్తించామన్నారు. కార్యక్రమంలో ఏఈవో ఎలీషా, విఏఏ వెంకట రాజు, యార్డు సూపర్‌వైజర్ అమీర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.




## గ్రంధాలయ వారోత్సవ గోడప్రతులు ఆవిష్కరణ



**వినుకొండ,నవంబర్13,ప్రభాతవార్త:** ఈ నెల 14వ తేది నుంచి 20వ తేది వరకు జాతీయ గ్రంధాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు వినుకొండ శాఖ గ్రంధాలయ ఇంచార్జి అధికారి భూక్య బద్రినాయక్ తెలిపారు. అందుకు సంబంధించిన గోడపత్రులను మున్సిపల్ కమీషనర్ సుభాష్‌చంద్రబోస్ చేతుల మీదుగా బుధవారం ఆవిష్కరించారు. విద్యార్థులకు పలు విభాగాల్లో పోటీలు నిర్వహించి బహుమతులు ప్రధానం చేయడం జరుగుతుందని చెప్పారు.

## నేటి నుంచి 57వ జాతీయ గ్రంధాలయ వారోత్సవాలు



**ఈపూరు,నవంబర్13,ప్రభాతవార్త:** ఈ నెల 14వ తేది నుంచి 20వ తేది వరకు జాతీయ గ్రంధాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ముప్పాళ్ల శాఖ గ్రంధాలయ అధికారిణి ఎస్ నాగలక్ష్మి తెలిపారు. వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు చిత్రలేఖనం, క్విజ్, వ్యాసరచన తదితర పోటీలు ఏర్పాటు చేయడం జరుగుతుందని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## నేటి నుంచి జోనల్ క్రీడా పోటీలు



**నూజెండ్ల, నవంబర్13, ప్రభాతవార్త:** మండలంలోని ఉప్పలపాడు గ్రామంలోని డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్ గరుకుల పాఠశాల నందు జోనల్ లెవల్ ఆటలు పోటీలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ రమణమ్మ తెలిపారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు ముఖ్య అతిథిగా పాల్గొని క్రీడాపోటీలు ప్రారంభిస్తారని పేర్కొన్నారు. మూడు జిల్లాల పరిధిలోని క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనున్నట్లు చెప్పారు.

## మాజీమంత్రి విడుదల రజినిపై ఎస్పీకి ఫిర్యాదు

**నరసరావుపేట క్రైం, నవంబర్ 13 ప్రభాతవార్త :** మాజీమంత్రి విడుదల రజని తమను ఇబ్బందులకు గురి చేసిందని జిల్లా ఎస్పీ కార్యాలయంలో బుధవారం పలువురు ఫిర్యాదు చేశారు. బాధితులు మాట్లాడుతూ మాజీమంత్రితో పాటు తమ ఫిర్యాదులో అప్పటి సి.ఐ. సూర్యనారాయణపై విమర్శలు చేశారు. అదే విధంగా మంత్రి పిఏలుగా పని చేసినటువంటి రామకృష్ణ, ఫణీంద్రలు వేధించారన్నారు. తమతో పాటు తెలుగుదేశంపార్టీ నాయకులు ఇబ్బందులు తెలిపేందుకు ఎస్పీ కార్యాలయానికి వచ్చినట్లు పేర్కొన్నారు. వైకాపా ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో తమను అనేక ఇబ్బందులకు గురిచేసి దారుణంగా వేధించారన్నారు. పోలీస్‌స్టేషన్‌లలో కొట్టి చిత్రహింసలకు గురి చేశారని పేర్కొన్నారు. తెలుగుదేశంపార్టీకి పని చేస్తే చంపేస్తామని బెదిరించారన్నారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో ఉన్న వైకాపా వారిని అరెస్ట్ చేస్తున్నారంటూ గగ్గోలు పెట్టడం విచిత్రంగా ఉందన్నారు. తమను ఇబ్బందులకు గురి చేసిన సమయంలో చట్టాలు, నిబంధనలు ఏమయ్యాయని బాధితులు ప్రశ్నించారు.

## నేటి నుండి శాఖా గ్రంథాలయ వారోత్సవాలు

**రొంపిచర్ల, నవంబర్ 13 ప్రభాతవార్త :** నరసరావుపేట మండలంలోని ఉప్పలపాడు శాఖా గ్రంథాలయంలో ఈ నెల 14 నుండి 20 వరకు గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి పాశం నారాయణరెడ్డి మంగళవారం తెలియజేశారు. వారోత్సవాలు వారం రోజుల పాటు జరుగుతాయన్నారు. వారోత్సవాలలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వం, క్విజ్ పోటీలతో పాటు పుస్తక పఠనం జరుగుతుందన్నారు.

## 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

**నకరికల్లు, నవంబర్ 13 ప్రభాతవార్త :** స్థానిక శాఖా గ్రంథాలయంలో ఈ నెల 14 నుండి 20 వరకు 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి కేసరి రమణారెడ్డి మంగళవారం తెలియజేశారు. వారోత్సవాలలో భాగంగా స్థానిక విద్యార్థినీ విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, వకృత్వం పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. పోటీలలో విజేతలైన విద్యార్థులకు వారోత్సవాల ముగింపు రోజైన 20వ తేదీన బహుమతుల ప్రధానోత్సవం జరుగుతుందని గ్రంథాలయ అధికారి రమణారెడ్డి తెలియజేశారు.

## ఆర్యవైశ్య అన్నదాన సత్రం నందు విశ్వశాంతి సోమరుద్ర మహాయాగం

**నరసరావుపేట టౌన్, నవంబర్ 13 ప్రభాతవార్త :** కార్తీకమాసం సందర్భంగా కొటప్పకొండలో కొలువైయున్న శ్రీ త్రికోటేశ్వరస్వామి సన్నిధిలో విశ్వశాంతి ఉద్గీథ సోమరుద్ర సోమరుద్ర మహాయాగం జరుగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు. కోటప్పకొండలో గల వాసవి కన్యకా పరమేశ్వరి అన్నదాన సత్రంలో 10వతేదీ నుండి 16వ తేదీ వరకు ఏడు రోజుల పాటు ఈ కార్యక్రమం జరుగుతుందని ప్రకాశం జిల్లా కైలాస శ్రమ శాంతి నిలయం తెలియజేసింది. 10వతేదీ నుండి ప్రారంభమయ్యే యాగానికి సంబంధించి వివరాలను తెలియజేశారు. ఇప్పటివరకు స్వామివారు 201 యాగాలను వివిధ పుణ్యక్షేత్రాలలో నిర్వహించారని తెలిపారు. యాగంలో కూర్చునే దంపతులు కొబ్బరికాయలు, తాంబూలం, ఆవునెయ్యి వెంట తెచ్చుకోవాలన్నారు.

## నేటి నుండి గ్రంథాలయ వారోత్సవాలు

**బాపట్ల,నవంబర్13,ప్రభాతవార్త:** బాపట్ల పట్టణంలోని శాఖ గ్రంథాలయంలో ఈనెల 14నుంచి 20వ తేది వరకు 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు శాఖ గ్రంథాలయం లైబ్రేరియన్ గ్రేడ్1 ఏ శివాజీ గణేష్ తెలిపారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో బుధవారం శాఖ గ్రంథాలయ వారోత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాఖ గ్రంథాలయ వారోత్సవాలలో ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు, పట్టణ ప్రజలు గ్రంథాలయ పాఠకులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. వారోత్సవాలు వారం రోజులు పాటు ప్రతి రోజు గ్రంథాలయాలపై అవగాహన కల్పించే విధంగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల20వ తేదిన నిర్వహించే గ్రంథాలయ ముగింపు వారోత్సవాలలో ముఖ్యఅతిథులుగా బాపట్ల శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ, మున్సిపల్ కమీషనర్ రఘునాథ్ రెడ్డి ముఖ్యఅతిథిలుగా పాల్గొంటారని ఆయన తెలిపారు.



## బాలలు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

**యడ్లపాడు, నవంబర్ 13, ప్రభాతవార్త :** రాజ్యాంగం బాలల హక్కులను గౌరవించి పరిరక్షించుతుందని, బాలల హక్కులు, బాధ్యతలు ఐక్యరాజ్యసమితి 1989లో ప్రతిపాదించిందని, ప్రపంచంలోని బాలల, యువకుల హక్కులు భారత ప్రభుత్వం పత్రాన్ని 1992లో అమోదించిందని, వీటిని ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని నరేంద్ర సువర్ణ కుమారి ఫౌండేషన్ నిర్వహకులు ఎన్ సువర్ణ కుమారి పేర్కొన్నారు. యడ్లపాడు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం సంస్థ అధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో అమె పాల్గొని ప్రసంగించి, విద్యార్థిని, విద్యార్థులకు వంద భోజన ప్లేట్‌లను పంపిణీ చేసారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ బాలలు విధిగా తమ హక్కులను తెల్సుకోవాలని, హక్కులు సంపూర్ణమైన ఆరోగ్యం, నాణ్యమైన ఉచిత విద్య, క్రీడలు, వినోదం, పరిశుభ్రమైన త్రాగునీరు, పోషకాహారం, గౌరవం, సమానత్వం, భావ వ్యక్తీకరణ, సమాన విద్యా అవకాశాలు, స్వేచ్ఛగా ఆలోచించటం, మానసిక, శారీరక వేదింపుల నుండి విముక్తి, ప్రేమా అప్యాయతలు, సామాజిక భద్రత, బాలల హక్కుల సంరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత ఎంతో ఉందన్నారు. అర్టికల్ 24ప్రకారం కర్మాగారాలలో చిన్నారులను నియమించటం వంటివి నిషేదించడమైందన్నారు. తదుపరి పాఠశాల హెచ్ ఎమ్ బిజయభారతి మాట్లాడుతూ దాతలు అందజేసే సహాయ సహకారాలను అందిపుచ్చుకొని విద్యలో రాణించాలన్నారు. సంస్థ నిర్వహకులను పాఠశాల తరపున సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఎస్ఎమ్‌సీ చైర్మన్ రేహనా, వైస్ చైర్మన్ జి శివరామకృష్ణ పాల్గొన్నారు.



## వాలంటీర్లు పోస్టుకార్డుల ఉద్యమం

**పొన్నూరు, నవంబర్ 13,ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వాలంటీర్స్ అసోసియేషన్(ఎఐవైఎఫ్)సంస్థ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రికి ఉత్తరాల ద్వారా విజ్ఞాపన పత్రం అందించే కార్యక్రాన్ని బుధవారం నిర్వహించారు. వాలంటీర్లు అందరూ పట్టణంలోని పోస్టాఫీసు వద్దకు వచ్చి ఉత్తరాలను సీఎంకు పంపించారు. ఈ సందర్భంగా వాలంటీర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గద్దె వెంకట భవాని ప్రసాద్ మాట్లాడుతూ వాలంటీర్స్ వ్యవస్థ కరోనా టైంలో చేసిన సేవలను కొనియాడారు. తమ ప్రాణాలను కూడా లెక్కచేయకుండా కరోనా రోగుల వద్దకు వెళ్ళి వారికి అవసరమైన వాటిని అందించారన్నారు. వాలంటీర్స్ అందరూ ఏ రాజకీయపార్టీకి లోబడి పనిచేయాలేదన్నారు. మునిసిపాలిటీ అయితే కమీషనర్, పంచాయితీ అయితే పంచాయికీ కార్యదర్శి ఆదేశాల మేరకు పనిచేసిన విషయాన్ని గుర్తు చేశారు. వాలంటీర్స్ అంతా ఈ రాష్ట్రానికి చెందిన యువత అని దాన్ని దృష్టిలో పెట్టుకొని ఇప్పుడు ఉన్న కూటమి ప్రభుత్వం వాలంటీర్స్‌ను యధావిధిగా కొనసాగించాలని కోరారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీ ఇచ్చిందని, వారి మాటను నిలబెట్టుకోవాలని కోరారు. హామీ మేరకు రూ.10వేలు ఇవ్వాలని, ఐదు నెలల నుంచి పెండిగ్‌లో వున్న జీతాలను విడుదల చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు షేక్ జానీ, గోపి, మోహన్, మల్లేశ్వరి, పర్వీన్, వాలంటీర్స్ గౌరవాధ్యక్షుడు ఆరేటి రామారావు తదితరులు పాల్గొన్నారు.



## ద్విచక్ర వాహనాల చోరి నిందితులు అరెస్టు

**సత్తెనపల్లి, నవంబర్ 13 ప్రభాతవార్త :** ద్విచక్ర వాహనాలను చోరీ చేస్తున్న ఇద్దరు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డిఎస్పీ హనుమంతరావు మాట్లాడుతూ ఏపి, తెలంగాణ రాష్ట్రాలలో గన్నెబోయిన మణికంఠ, ఏసుబాబులు ద్విచక్ర వాహనాలను చోరీ చేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ, ఏపి రాష్ట్రాలలో 12 ద్విచక్ర వాహనాలను అపహరించారన్నారు. వాటి విలువ రూ.8 లక్షలు ఉంటుందన్నారు. జలసాలకు అలవాటుపడి వాహనాలను చోరీ చేసి గుంటూరులోని మాయాబజార్‌లో విక్రయిస్తున్నారని తెలిపారు. సమావేశంలో సి.ఐ.లు బ్రహ్మయ్య, శ్రీనివాసరావు, ఎస్.ఐ. పవన్, పిసి శంకర్ తదితరులు పాల్గొన్నారు.



# దేవాలయాల అభివృద్ధికి సహకారం ఇవ్వండి : ఎమ్మెల్యే అరవింద్‌బాబు

**నరసరావుపేట, నవంబర్ 13 ప్రభాతవార్త :** నరసరావుపేట నియోజకవర్గం దేవాలయాల అభివృద్ధికి సహకారం ఇవ్వండి అని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు కోరారు. బుధవారం దేవాదాయ ధర్మాదాయశాఖామంత్రి ఆనం రామ్‌నారాయణరెడ్డిని మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ కలిశారు. ఈ సందర్భంగా వినతిపత్రాన్ని అందజేసి దేవాలయాలకు సంబంధించిన వివరాలను తెలియజేశారు. ప్రముఖ శైవక్షేత్రమైన కోటప్పకొండపై వేంచేసియున్న శ్రీ త్రికోటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు రావాలని మంత్రి రామ్‌నారాయణరెడ్డిని ఎమ్మెల్యే అరవింద్‌బాబు కోరారు. కోటప్పకొండలో జరుగుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ఈ సందర్భంగా వివరించారు. త్రికోటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు జిల్లా, రాష్ట్ర, దేశ వ్యాప్తంగా భక్తులు, పర్యాటకులు ప్రతి నిత్యం వస్తుంటారని తెలిపారు. త్రికోటేశ్వరస్వామి ఆలయ విశిష్టతను, స్వామివారి మహిమ గురించి మంత్రికి ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట పార్టీ నాయకులు వాసిరెడ్డి రవి, కొవ్వూరి బాబు, పూనాటి శ్రీనివాసరావు, అత్తులూరి సుబ్బారావు తదితరులు ఉన్నారు.



## స్వర్ణాంధ్ర ఎమ్మార్పిఎస్ జిల్లాస్థాయి సమావేశం

**గుంటూరు విద్య,నవంబర్ 13,ప్రభాతవార్త :** స్వర్ణాంధ్ర ఎమ్మార్పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు ఏసుబాబు మాదిగ అధ్యక్షతన జిల్లాస్థాయి సమావేశం బుధవారం నగర కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై సమావేశం చర్చించింది. మాదిగ కార్పొరేషన్ చైర్మన్‌గా మాజీ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవిని నియమించడంపై కూటమి ప్రభుత్వాన్ని అభినందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు కి, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కి , బిజేపి రాష్ట్ర అధ్యక్షులు పురంధేశ్వరీకి అభినందనలు తెలిపారు. ఎస్సీ వర్గీకరణ సాధ్యమైనంత త్వరగా జరిపి సామాజిక న్యాయం మాదిగలకు త్వరితగతిన అందించాలని ఈ సందర్భంగా ఏసుబాబు మాదిగ తీర్మానాన్ని సమావేశంలో ప్రవేశపెట్టారు. సభ్యులందరూ తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు. మాదిగ కార్పొరేషన్‌కు మరిన్ని నిధులు మంజూరు చేయాలని మాదిగల సామాజిక, సాంఘీక ,ఆర్థిక, విద్యాభివృద్ధికి, చేతివృత్తుల పనుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేయాలని ఏసుబాబు మాదిగ ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా గుంటూరు నగర కార్యవర్గాన్ని ఏసుబాబు మాదిగ ఎంపిక చేశారు. గుంటూరు నగర ఉపాధ్యక్షులుగా గూడూరు విజయ్ మాదిగ ను, గుంటూరు వన్‌టౌన్ అధ్యక్షులు బళ్ళారపు శ్యామ్‌మాదిగను నియమించారు. గుంటూరు వన్ టౌన్ ఉపాధ్యక్షులుగా ఆరుమళ్ళ చెంచు మాదిగను నియమించారు. గుంటూరు టూ టౌన్ అధ్యక్షులుగా ఏనుబర్ల సురేష్ మాదిగను నియమించారు. గుంటూరు జిల్లా అధ్యక్షులుగా మక్కెన ప్రభాకర్ మాదిగను, గుంటూరు నగర అధ్యక్షులుగా సుబ్బయ్య మాదిగను నియమించారు. స్వర్ణాంధ్ర ఎమ్మార్పిఎస్ లక్ష్యసాధనకు నూతనంగా నియామకం పొందిన ప్రతి ఒక్కరూకృషి చేయాలని ఏసుబాబు మాదిగ పిలుపునిచ్చారు.

## యువతకు ఫ్యూచర్ టెక్‌స్కిల్స్‌లో శిక్షణ

**విజయవాడ, నవంబర్ 13, ప్రభాత'వార్త' :** ఇన్నోవేషన్ క్యాంపస్ ప్రోగ్రాం 2024 కింద 3,500 మంది విద్యార్థులకు సర్టిఫికేషన్ పూర్తి చేశామని సంస్థ ప్రతినిథులు ప్రకటించారు. భారతప్రభుత్వ స్కిల్స్ ఇండియా, డిజిటల్ ఇండియా కార్యక్రమలకు అనుగుణంగా శాంసంగ్ ఇన్నోవేషన్ క్యాంపస్ యువతకు ఏఐ, ఇంటర్నెట్ ఆఫ్థింగ్స్, బిగ్‌డేటా, కోడింగ్, ప్రోగ్రామింగ్ వంటి డిమాండ్ వున్న సాంకేతికరంగాల్లో శిక్షణ ఇచ్చామన్నారు.

## కెఎఫ్‌సి మెనూ ఆస్వాదించిన దేవరకొండ విజయ్

**విజయవాడ, నవంబర్ 13, ప్రభాత'వార్త' :** యాక్షన్‌స్టార్ విజయ్ దేవరకొండ కెఎఫ్‌సిలో క్రిస్పీ చికెన్ బకెట్, క్లాసిక్ అమెరికా జింగర్ సహా కెఎఫ్‌సి మెనూను ఆస్వాదించారు. తన వరుస చిత్రాలున్న పోస్టులో చిక్‌బ్లాక్‌షర్ట్, తెలుపు లెనెన్‌పాంట్, లేతగోదుమరంగా బీనీ తో గాలిలో ఎగిరే హాట్ బెలూన్లో ప్రయాణిస్తూ విజయ్ కనిపించారు.

## బాదంతో రక్తంలో చక్కెరస్థాయి నియంత్రణ

**అమరావతి, నవంబర్ 13, ప్రభాత'వార్త' :** మనం తినే ఆహారంలో ప్రపంచ మధుమేహ దినోత్సవాన బాదం చేర్చడం ద్వారా మధుమేహ నియంత్రణ జరుగుతుంది. రక్తంలోని చక్కెర స్థాయిని నిర్వహించడానికి సహాయపడే ప్రోటీన్, అసంతృప్త కొవ్వులు, డైటరీ ఫైబర్ వంటి 15 ముఖ్యపోషకాలుంటాయి. టైప్2 డయాబెటీస్ వున్నవారిలో బ్లడ్ షుగర్ ప్రభావాన్ని తగ్గించడానికి తోడ్పడుతుందన్నారు.

## సంవత్సరాంతపు ఆఫర్లతో టొయోటా కిర్లోస్కర్

**విజయవాడ, నవంబర్ 13, ప్రభాత'వార్త' :** తమ ప్రసిద్ధ మోడల్స్ గ్లాన్జా, అర్బన్ క్రూయిజర్ టైసర్, అర్బన్ క్రూయిజర్ హైరైడర్లలో ప్రత్యేకమైన లిమిటెడ్ ఎడిషన్లను అందుబాటులోకి తెచ్చినట్లు టొయోటా కిర్లోస్కర్ మోటార్ ప్రతినిథులు ప్రకటించారు. స్పెషల్ లిమిటెడ్ ఎడిషన్ కాకుండా, టొయోటా గ్లాంజా, అర్బన్ క్రూయిజర్ టైసర్, రూమియన్ (సిఎన్‌జి మోడల్స్ మినహా) రు.1లక్షపైన డిసెంబర్ 31 వరకు ప్రత్యేకమైన ఇయర్‌ఎండ్ ఆఫర్లిస్తున్నామన్నారు.

## నేటినుండి గ్రంథాలయ వారోత్సవాలు : స్థానిక గ్రంథాలయ చైర్మన్ తేళ్ల సుబ్బారావు

**చిలకలూరిపేట, నవంబర్13, ప్రభాతవార్త:** గ్రంథాలయ వారోత్సవాలు ఈ నెల 14వ తేదిన స్థానిక గ్రంథాలయంలో57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు స్థానిక గ్రంథాలయ అభివృద్ధి కమిటి చైర్మన్ తేళ్ల సుబ్బారావు తెలిపారు. ఈ మేరకు 57వ గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ వారోత్సవాలను మున్సిపల్ కమీషనర్ పి శ్రీహరిబాబు ప్రారంభిస్తారని అన్నారు. ప్రతి రోజు విద్యార్థులు పలు పోటీలు ఉంటాయని, ఈనెల 20వ తేది బుధవారం మద్యాహ్నం 12 గంటలకు బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని ముఖ్య అతిథిగా రానున్నారని తెలిపారు. కావున ఈ అవకాశాన్ని విద్యార్థులు ఉపయోగించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ ఇన్‌చార్జి అధికారి యం నాగూల్‌మీరావలి, తదితరులు పాల్గొన్నారు.



## జిల్లా పరిషత్ భూముల కబ్జాపై ఫిర్యాదు

**కారంపూడి, నవంబరు 13 ప్రభాతవార్త:** మండలంలోని ఒప్పిచర్ల గ్రామంలో జిల్లా పరిషత్ భూమి కబ్జాకు గురైందని ఆ ప్రాంత వాసులు బుధవారం మంగళగిరిలోని తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఒప్పిచర్ల గ్రామానికి చెందిన వ్యక్తి రెవెన్యూ అధికారులతో నకిలీ పట్టాలు సృష్టించుకొని నిరుపేదలను ఇబ్బందులకు గురి చేస్తున్నాడని పేర్కొన్నారు. స్పందించి ఉన్నతాధికారులతో విచారణ జరిపి న్యాయం చేయాలని ఫిర్యాదులో కోరారు.



## శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి జయంతి వేళ ప్రత్యేక పూజలు

**తెనాలి, నవంబరు 13 (ప్రభాతవార్త) :** కాలజ్ఞాన సృష్టికర్త శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి 416వ జయంతిని పురస్కరించుకుని బుధవారం స్థానిక గాంధీచౌక్ లోని శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవస్థానంలో స్వామివారికి విశేష పూజాది కార్యక్రమాలను అర్చకులు నాగభాస్కర్ ఆగమోక్తంగా నిర్వహించారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని భక్తి శ్రద్ధలతో పూజలు జరిపారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో హరిప్రసాద్ మాట్లాడుతూ స్వామివారి 416వ జయంతి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజాది కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు గుంట ముక్కల నాగార్జున మాట్లాడుతూ ఆలయంలో ఘనంగా స్వామి జయంతివేళ అన్నప్రసాద వితరణ సేవలు నిర్వహించుకోవడం సంతోషకం ాన్నారు. భక్తులందరికీ స్వామివారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కొనన సురేంద్ర, కర్రి బ్రహ్మాజీ, చాపల ఆదినారాయణ, దుర్గా తదితరులు పాల్గొన్నారు.



## జిల్లా శిక్షా కార్యాలయంలో ఖాళీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

**రొంపిచర్ల, నరసరావుపేట నవంబర్ 13 ప్రభాతవార్త :** పల్నాడు జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పని చేస్తున్న అర్హులైన స్కూల్ అసిస్టెంట్‌ల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారిణి ఎల్.చంద్రకళ బుధవారం తెలియజేశారు. జిల్లా సమగ్ర శిక్షా కార్యాలయం నందు ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ఐఈ కోఆర్డినేటర్, అసిస్టెంట్ అకాడమి మానిటరింగ్ ఆఫీసర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సమగ్ర శిక్షా కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలన్నారు. ఒకటి కంటే ఎక్కువ పోస్టులకు దరఖాస్తు చేయదలచిన వారు విడివిడిగా దరఖాస్తులను సమర్పించాలని జిల్లా విద్యాశాఖాధికారిణి ఎల్.చంద్రకళ తెలియజేశారు.

## పంచాయతీల అభివృద్ధిపై ప్రజా ప్రతినిధులతో సమావేశం

**కర్లపాలెం, నవంబర్13, ప్రభాతవార్త:** కర్లపాలెం మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం కర్లపాలెం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలపై (2025-26)గ్రామ సర్పంచ్‌లు, ఎంపిటిసీలకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పంచాయతీల అభివృద్ధికి తీసుకోవలసిన చర్యలు ప్రణాళికలపై సర్పంచులకు ప్రజా ప్రతినిధులకు ప్రత్యేకంగా వివరించారు. దానికి అనుగుణంగా పంచాయతీ కార్యదర్శులు ప్రణాళికలు రూపొందించుకోవాలని ఎంపిపి యారం వనజ తెలిపారు. ఈ కార్యక్ర మంలో ఎంపిడివో అద్దురి శ్రీనివాసరావు, ఈఓపి ఆర్‌డి ఐనంపూడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



## వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది

**కర్లపాలెం, నవంబర్13, ప్రభాతవార్త:** మండల పరిధిలోని కర్లపాలెం బుద్దాం గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండల వ్యవసాయ అధికారి సుమంత్ కుమార్ మాట్లాడుతూ వరి చిరుపొట్ట దశలో ఉన్నందున నత్రజని ఎరువుతో పాటుగా పోటాష్ ఎకరాకు 20కేజీల చొప్పున తప్పనిసరిగా వేసుకోవాలని తద్వారా గింజ నాణ్యత మరియు దిగుబడులు పెరిగే అవకాశం ఉంటుందని సూచించారు. వరి పునరుత్పత్తి దశలో పొలంలో నీరు ఉండేలా చూసుకోవడం చాలా ముఖ్యమని తెలిపారు. ఈ వాతావరణంలో అగ్గి తెగులు సోకే అవకాశం ఉంటుందని తెగులు ఉధృతి తక్కువ ఉన్నప్పుడు ట్రైసైక్లెజోల్ 120గ్రా ఎకరాకు అదే ఎక్కువ ఉధృతి ఉన్నప్పుడు ప్యూజివన్ 300మిలి లేదా కాసు బి 500మిలీ పిచికారీ చేసుకోవాలని సూచించారు. ఆకు చివరి కోసలు ఎర్రబడానికి ప్రధానంగా నల్లి సోకడం పోటాష్ లోపం కారణం కావచ్చని బెట్ట పరిస్థితులు ఉన్నప్పుడు నల్లి సోకుతుందని తెలిపారు. నల్లి నివారణకు ప్రొపెనోఫోస్ 400మిలీ ఎకరాకు లేదా ప్రోపార్గైట్ 400మిలీ పిచికారి చేయాలని సూచించారు. సుడి దోమ నివారణకు పైమెట్రోజైన్ లేదా డైనోటేఫ్యూరోన్ 80గ్రా ఎకరాకు పిచికారి చేసుకోవాలని తెలిపారు. దోమ ఎక్కువగా ఉన్నపుడు మాత్రమే పెగ్జలాన్94మిలి ఎకరాకు పిచికారి చేసుకోవాలని సూచించారు. రబీ సీజన్ లో వేసుకోనుట కొరకు బిపిఎన్8మినుము చిరు సంచులు అందుబాటలో ఉన్నాయని ఈ రకము పల్లాకు తెగులును తట్టుకొని అధిక దిగుబడులను ఇచ్చే సాధా రకమని ఆసక్తి గల రైతులు మండల కార్యాలయంలో సిబ్బందిని సంప్రదించి తీసుకోవలసిందని తెలిపారు. రబీలో పంట వేసిన వారు నమోదు చేయించుకోవడానికి ఈనెల 17వ తారీఖు నుండి సైట్ అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విస్తరణ అధికారి భాగ్యలక్ష్మీ, గ్రామ వ్యవసాయ సహాయకులు భ్రమరాంబ, బాజీ మరియు రైతులు పాల్గొన్నారు.



## మార్కెట్‌కు గేట్లు ఏర్పాటు చేయండి

### -షాపుల యజమానులు కమిషనర్‌కు వినతి

**పొన్నూరు, నవంబర్ 13, ప్రభాతవార్త:** పట్టణంలోని కొప్పాక వెంకయ్య కూరగాయల మార్కెట్‌లోని షాపుల యజమానులు మార్కెట్‌కు సంబంధించిన గేట్లు సక్రమంగా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని, గేట్లు ఏర్పాటు చేయాలని కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. కూరగాయల మార్కెట్‌కు సంబంధించిన గేట్లు విరిగిపోయి చాలా కాలం అయిందని, కుక్కలు, పందులు తదితర జంతువులు లోనికి వస్తున్నాయ న్నారు. రాత్రివేళల్లో కూడాతాము గేట్లు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. వినతిపత్రం అందజేసినవారిలో పఠాన్ ఫిరోజ్‌ఖాన్, జానపాటి శ్రీనివాసరావు, మొల్లా కరీమ్, సంధాని, నజీర్, కరీమ్ తదితరులున్నారు.



## అగ్గి తెగులు నివారణపై రైతులు దృష్టిపెట్టాలి

### -మండల వ్యవసాయాధికారి వెంకట్రామయ్య

**పొన్నూరు, నవంబర్ 13, ప్రభాతవార్త:** ప్రస్తుతం వరిపైరులో అగ్గి తెగులు కనిపిస్తుందని, దీని నివారణపై రైతులు ప్రత్యేక దృష్టి పెట్టాలని మండల వ్యవసాయాధికారి డేగల వెంకట్రామయ్య కోరారు. మండల పరిధిలోని జూపూడి, వెల్లలూరు గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. అగ్గి తెగులు నివారణకు రైతులు ట్రై సైక్లోజోల్ 75శాతం ఎస్పీ అనే తెగులు మందుని 120గ్రాములు ఒక ఎకరానికి 200లీటర్లలో కలిపి పిచికారి చేయాలని సూచించారు. పాము పొడ తెగులు నివారణకు హెక్సా కొనజోల్ 5శాతం ఎస్సీ అనే తెగులు మందుని 400మిల్లీ లీటర్లు ఒక ఎకరానికి 200లీటర్ల నీటితో కలిపి పిచికారి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం నుండి రాజారత్నం, సుమలత, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.




## ఉర్దూ స్కూల్‌లో ఆయుష్ వైద్య శిబిరం

**బెల్లంకొండ, నవంబర్ 13 ప్రభాతవార్త :** బెల్లంకొండ ఉర్దూ స్కూల్లో ఆయుష్ వైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. స్థానిక ఎంపిపిఎస్ ఉర్దూ స్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ ఆర్.శ్రీనివాస్ సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. దోమకాటు వలన వచ్చే వ్యాధులు మలేరియా, ఫైలేరియా, చికెన్‌గున్యా వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. వ్యాధినిరోధక శక్తి పెంచుకోవడానికి అవసరమైన ఆయుష్ మందులను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం పాపమ్మ, కరీష్మ, జానీబేగం, ఆయుష్ సిబ్బంది ప్రభుప్రసాద్, యోగా టీచర్ కోటేశ్వరమ్మ పాల్గొన్నారు.




## 15 నుండి రాష్ట్రీయ బాలల ఆరోగ్య కార్యక్రమం

**నరసరావుపేట, నవంబర్ 13 ప్రభాతవార్త :** పల్నాడు జిల్లాలో ఈ నెల 15వతేదీ నుండి రాష్ట్రీయ బాల ఆరోగ్య కార్యక్రమం జరుగుతుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ రవికుమార్ అన్నారు. ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన ఇంటింటికి ఆరోగ్య పరీక్షలు వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జరుగుతాయన్నారు. ప్రతి ఇంటిలో బిపి, షుగర్, ఇతర పరీక్షలను ఇంటి వద్దనే వైద్య సిబ్బంది చేస్తారన్నారు. వీటితో పాటు క్యాన్సర్ సర్వేలు కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సేకరించిన వివరాలను ఆన్‌లైన్‌లో నివేదిక రూపంలో ప్రభుత్వానికి పంపడం జరుగుతుందన్నారు. క్యాన్సర్ వంటి వ్యాధులను గుర్తిస్తే వాటి లక్షణాలను తెలియజేసి వైద్యసేవలను, చికిత్సను అందిస్తామన్నారు. బాల ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా 15వతేదీ నుండి 0-15 సంవత్సరాలలోపు వయస్సు కలిగిన చిన్నారులకు పరీక్షలు చేయడం జరుగుతుందన్నారు. లోపాలు ఉంటే వారికి తగిన పోషకాహారం అందిస్తామని, రికార్డులో వారి ఆరోగ్య వివరాలను నమోదు చేయడం జరుగుతుందని డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ రవికుమార్ తెలియజేశారు.



